క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడికి గాయాలు



ఏటూరునాగారం: రోడ్డు ప్రమాదంలో ప్రభుత్వ ఉపాధ్యాయుడికి గాయాలైన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన భిక్షపతి మానసపల్లిలో ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. అతడి ద్విచక్రవాహనంలో పెట్రోల్ అయిపోవడంతో జాతీయ రహదారి పక్కన గల పెట్రోల్ బంక్‌కు వెళ్తున్నాడు. ఈ క్రమంలో కూలీలతో వస్తున్న టాటాఏస్ వాహనం భిక్షపతిని బలంగా ఢీకొట్టింది. దీంతో తీవ్ర గాయాలు కావడంతో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి 108లో తరలించి మెరుగైన వైద్యం కోసం వరంగల్‌కు తరలించారు.

ఫిట్స్‌తో రైతు మృతి



ములుగు రూరల్(గోవిందరావుపేట): పంట చేనుకు నీరు పెట్టేందుకు వెళ్లి ఫిట్స్ రావడంతో నీళ్లలో జారిపడి రైతు మృతి చెందిన సంఘటన గోవిందరావుపేట మండలంలోని పస్రాలో మంగళవారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పస్రా గ్రామానికి చెందిన గిరి సాంబయ్య (52) అతడి వ్యవసాయ పంట పొలానికి నీరు పెట్టేందుకు వెళ్లాడు. ఈ క్రమంలో సాంబయ్యకు ఫిట్స్ రావడంతో బోర్ మోటర్ నీళ్లు పోసే గుంతలో పడి మృతి చెందాడు. అటుగా వెళ్లిన పక్క రైతులు గమనించే సరికి సాంబయ్య మృతి చెందినట్లు తెలిపారు.

అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు విరాళం



కాటారం: మహదేవపూర్ మండలం ఎడపల్లిలో ఏర్పాటు చేయనున్న రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ విగ్రహం కోసం కాటారం మండలం మద్దులపల్లి పంచాయతీ కార్యదర్శి బీరెల్లి కరుణాకర్ మంగళవారం విరాళం అందజేశారు. రూ.5వేలను నిర్వహణ కమిటీకి ఇవ్వగా మార్చి 12న నిర్వహించనున్న విగ్రహావిష్కరణ కార్యక్రమానికి హాజరు కావాలని కమిటీ సభ్యులు ఆహ్వానపత్రాన్ని కరుణాకర్‌కు ఇచ్చారు. ఈ సందర్భంగా కరుణాకర్ మాట్లాడుతూ.. మహనీయుడు అంబేడ్కర్ అంటే తనకు ఎనలేని గౌరవం అని పే బ్యాక్ టు సొసైటీ ద్వారా ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటు కమిటీ సభ్యులు శ్రీనివాస్, జక్కయ్య, సమ్మయ్య, సాబయ్య పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



మొగుళ్లపల్లి: విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న ఆర్టిజన్ కార్మికుల తమ సమస్యలు పరిష్కరించాలని జిల్లా జేఏసీ కమిటీ తరఫున మంగళవారం మండల కేంద్రంలో ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డికి విద్యుత్ ఉద్యోగులు వినతిపత్రం అందజేశారు. ఆర్టిజన్ కార్మికులందరికీ పరిమితిలేని వైద్య సదుపాయం కల్పించాలి, పని భారం తగ్గిస్తూ అన్‌మ్యాన్డ్ కార్మికులతో సబ్ స్టేషన్ ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని కోరారు. కారుణ్య నియామకాల క్రింద గతంలో విద్యార్హతలు బట్టి ఆర్టిజన్ 1, 2, 3గా నియామకపు ఉత్తర్వులు ఇచ్చేవరని ప్రస్తుతం గ్రేడ్-4గా ఉద్యోగాలు ఇస్తామనడం అన్యాయమన్నారు. విద్యార్హతలను పరిగణలోకి తీసుకొని కారుణ్య నియామకం కింద ఆర్టిజన్లకు గ్రేడ్-1, 2, 3గా ఉత్తర్వులు ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా చైర్మన్ ఒంటేరు మల్లయ్య జిల్లా కన్వీనర్ నాగుల తిరుపతిరెడ్డి, కో కన్వీనర్లు కోటి సురేందర్, ఉపాధ్యక్షులు తిప్పరపు రాజు కొత్తూరి మధు ఉన్నారు.

ఆర్థిక సాయం

చిట్యాల: మండల కేంద్రానికి చెందిన అంకం స్వామి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని చిట్యాల పద్మశాలీ వీవర్స్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు ఈగ కోటి, సంఘం సభ్యుల ఆధ్వర్యంలో మంగళవారం పరామర్శించి రూ.5000ల ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి సామల రాజేందర్, ఆడిట్ సభ్యులు చిప్ప విశ్వనాథం, క్యాతం మార్కెండయ, కందుల రమేష్, అంకం రమేష్ పాల్గొన్నారు.

ముందస్తు ప్రణాళికతో అభివృద్ధి



కంటి వెలుగు కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

ఏటూరునాగారం: మండలంలో ముందస్తు ప్రణాళికలతో గ్రామాల అభివృద్ధి జరుగుతుందని ఎంపీపీ అంతటి విజయ నాగరాజు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో బ్లాక్ పంచాయతీ డెవలప్ మెంట్ ప్లాన్ (బీపీడీపీ) సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపీపీ మాట్లాడుతూ.. గ్రామాల్లో ఎక్కడ ఎలాంటి సమస్య ఉందని గుర్తించి ముందస్తుగా ప్రణాళికలు రూపొందించుకొని ఆన్‌లైన్ చేస్తే ఆ పనులకు నిధులు మంజూరు అవుతాయన్నారు. నిధులు ఉన్నాయని ఎక్కడబడితే అక్కడ పనులు చేయడానికి అనుమతి లేదన్నారు. ముందు ఎక్కడ పని కావాలో అక్కడ నిర్ణయించుకొని ప్లాన్ చేసుకోవాలన్నారు. మండలంలోని గ్రామాల అభివృద్ధి కోసం రూ.1.50 కోట్ల వరకు నిధుల మంజూరు వచ్చిందన్నారు. మండల అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో గ్రామాల్లో క్షేత్ర స్థాయిలో పర్యటించి పనులను గుర్తించాలని కోరారు. అనంతరం వైస్ ఎంపీపీ తుమ్మ సంజీవరెడ్డితో కలిసి కంటి వెలుగు కరపత్రాలను ఆవిష్కరించారు. గ్రామాల్లో కంటి వెలుగు శిబిరాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రజాప్రతినిధులు, వైద్య సిబ్బంది సహకారంతో టార్గెట్‌ను పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ కుమార్, సీడీపీఓ హేమలత, సూపర్‌వైజర్లు మనోరమ, ఏఓ వేణుగోపాల్, ఏపీఎం పాషా, సెరికల్చర్ అధికారి నరేందర్, ఎంపీటీసీ కోట నర్సింహులు, సూపరింటెండెంట్ ఉమారాణి, రొయ్యూర్ పీహెచ్‌సీ సీహెచ్ఓ శారద, ఏఎన్ఎం పద్మ, ఆశ కార్యకర్త శారద పాల్గొన్నారు.

అక్రమ పట్టాలను రద్దు చేయాలి



మాట్లాడుతున్న సుదర్శన్‌రావు

ములుగు రూరల్(గోవిందరావుపేట): గోవిందరావుపేట మండలం పస్రా శివారులో గల 109 సర్వే నంబర్‌లో అక్రమ పట్టాలను రద్దు చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పస్రాలో 109 సర్వే నంబర్‌లో గుడిసెలు వేసుకున్న నిరుపేదలతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ భూమిని భూస్వాములకు చేసిన అక్రమ పట్టాలను రద్దు చేసి నిరుపేద గుడిసె వాసులకు ఇళ్ల స్థలాలకు పట్టాలు మంజూరు చేయాలని అన్నారు. గుడిసెవాసులు ఐకమత్యంలో పట్టాలు పొందే వరకు పోరాటం చేయాలని అన్నారు. ప్రభుత్వం పట్టాలు మంజూరు చేసే వరకు సీపీఎం పార్టీ అండగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి తుమ్మల వెంకట్‌రెడ్డి, బీరెడ్డి సాంబశివ, పోషాలు, చిట్టిబాబు, ఉపేంద్రచారి, చంద్రారెడ్డి, రమేష్, , సీతారామరాజు, రాజేశ్వరి, సరిత, కృష్ణవేణి, రాంబాబు, మురళి తదితరులు పాల్గొన్నారు.

తునికాకు బోనస్ డబ్బులు చెల్లించండి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

వెంకటాపురం(కె): పెండింగ్‌లో ఉన్న తునికాకు సేకరణ బోనస్ డబ్బులను చెల్లించాలని కోరుతూ మంగళవారం అటవీ శాఖ కార్యాలయంలో అధికారులకు వ్యవసాయ కార్మిక సంఘం, ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు దబ్బకట్ల లక్ష్మయ్య మాట్లాడుతూ.. తునికాకు కార్మికులకు 2016 నుంచి 2022 వరకు తునికాకు సేకరణ బోనస్ పైసలు ఇంత వరకు చెల్లించలేదని అన్నారు. పెండింగ్‌లో ఉన్న తునికాకు బోనస్ సొమ్ములను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ప్రత్యేక్ష ఆందోళన చేపడతామని అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు గ్యానం వాసు, కొప్పుల రఘుపతి, దామోదర్ తదితరులు ఉన్నారు.

ప్రారంభమైన జాతర

మంగపేట: మండలంలోని మల్లూరు పంచాయతీ పరిధిలోని మామిడిగూడెంలో సమ్మక్క–సారలమ్మ జాతరను దేవరబాల(పూజారి) పూనెం జనార్దన్ ఆదివాసీ గిరిజన సాంప్రదాయబద్ధంగా మండమెలుగు కార్యక్రమంతో మంగళవారం సాయంత్రం ప్రారంభించారు. ఐదు రోజుల పాటు నిర్వహించే జాతరకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి వనదేవతల దీవెనలు పొందాలని పూజారి కోరారు. ఈ కార్యక్రమంలో తలపతి పూనెం వెంకటేశ్వర్లు, వడ్డెరేగ లక్ష్మయ్య, వాసం సాంబశివరావు, తాటి చందు, ఎట్టి సాయి, నల్లెబోయిన నాగమల్లేష్, కుల పెద్దలు కల్తి ఆనందరావు, పాయం సతీష్, యాలం రాజశేఖర్ ఆలయ వర్కింగ్ కమిటీ నాయకులు మారబోయిన గోవర్దన్ యాలం కాంతారావు, తోలెం శ్రీను, తాటి విజయ్‌బాబు, నల్లెబోయిన లక్ష్మణ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు పట్టుదలతో చదవాలి



ఏటూరునాగారం: పుస్తకాలు అందజేసిన దేవ్‌సింగ్, అధ్యాపకులు

ఏటూరునాగారం: జూనియర్ కళాశాల విద్యార్థులు పట్టుదలతో చదవాలని, అప్పుడే అనుకున్న లక్ష్యానికి చేరుకుంటామని రిటైర్డ్ మున్సిపల్ కమిషనర్ భూక్యా దేవ్‌సింగ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని విద్యార్థులకు నీట్, ఎంసెట్ పోటీ పరీక్షల పుస్తకాలను ఆయన ఉచితంగా అందజేసి మాట్లాడారు. నీట్, ఎంసెట్ ఫలితాల్లో విద్యార్థులు మంచి ర్యాంకులు సాధించాలని కోరారు. అనంతరం కళాశాల యజమాన్యం దేవ్‌సింగ్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు అనిల్‌కుమార్, వెంకటేష్, భిక్షం, శంకర్, నరేష్, ఉపేందర్, సుమన్ పాల్గొన్నారు.

ములుగు రూరల్: విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని రిటైర్డ్ మున్సిపల్ కమిషనర్ భూక్యా దేవ్‌సింగ్ అన్నారు. మంగళవారం గోవిందరావుపేట మండలంలోని జెడ్పీహెచ్‌ఎస్, కేజీబీవీ, మోడల్ పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు, ఇంటర్మీడియేట్ విద్యార్థులకు నీట్, ఎంసెట్ స్టడి మెటీరియల్‌ను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పదవ తరగతి పరీక్షల్లో 10 జీపీఏ సాధించి పాఠశాల, తల్లితండ్రులకు పేరు తీసుకురావాలని అన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయం తరలింపు

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ భవనం శిథిలావస్థకు రావడంతో ఐటీడీఏ పరిధిలోని పీఎంఆర్‌సీ భవనంలోకి గతంలో మార్చారు. మళ్లీ అనివార్య కారణాలతో ఆ కార్యాలయానికి ప్రభుత్వ ఆస్పత్రి సమీపంలోని పాత మలేరియా కార్యాలయంలోకి మార్చుతున్నట్లు తహసీల్దార్ సంజీవ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజలు, రైతులు, విద్యార్థులు, ప్రజాప్రతినిధులు గమనించాలని కోరారు.

నేటి నుంచి బొడ్రాయి ఉత్సవాలు

వెంకటాపురం (ఎం): మండలంలోని చాతరాజుపల్లి గ్రామంలో బుధవారం(నేటి) నుంచి మూడు రోజులపాటు బొడ్రాయి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ చాతరజు స్వప్న తెలిపారు. మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. ఈ నెల 22న గోపూజ, గణపతి పూజ, పుణ్యాహవచనము, యాగశాల ప్రవేశము, అగ్ని ప్రతిష్ఠాపన పూజలు, 23న మండప పూజలు, హోమాలు, ధాన్యదివాసము, ప్రదోశ పూజలు, 24న బొడ్రాయి ప్రతిష్ఠాపన, ఆంజనేయస్వామి, పోచమ్మ దేవత ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆమె వెంట గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు జగన్మోహన్ రావు, ప్రధాన కార్యదర్శి చాతరాజు గణపతిరావు, కమిటీ సభ్యులు చాతరాజు శ్రీధర్‌రావు, మండల సతీష్, చాతరాజు రవీందర్, మండల కిష్టయ్య, చాతరాజు భాస్కర్, ఉప సర్పంచ్ మహ్మద్ రుకియ, తదితరులు ఉన్నారు.

కంటి పరీక్షలు చేయించుకోవాలి



శిబిరాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ ఇన్నారెడ్డి

ములుగు రూరల్: గ్రామంలో అర్హులైన ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకోవాలని దేవగిరిపట్నం సర్పంచ్ ఇన్నారెడ్డి అన్నారు. మంగళవారం రాయినిగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. పంచాయతీ ఆధ్వర్యంలో శిబిరానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు. ప్రజలు కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నిరంజన్‌రెడ్డి, వైద్యాధికారి సిరాజుద్దీన్, ఆప్తామాలిక్ వినయ్, డీఈఓ మమత, ఏఎన్ఎంలు పూల్‌బంద్, సమ్మక్క, ఆశలు విజయ, సమ్మక్క, సుజాత, వజ్ర పాల్గొన్నారు.

తాగునీటికి ఇబ్బందులు

మంగపేట: మండలంలోని చుంచుపల్లిలో ప్రజలు తాగునీటి ఇబ్బందులు పడుతున్నారని మాజీ ఎంపీటీసీ సభ్యురాలు సమత మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గ్రామంలో తాగు నీటికి వినియోగించే రెండు చేతి పంపులు పాడై పోయి రెండు నెలలు గడుస్తున్న అధికారులు మరమ్మతులు చేపట్టడం లేదన్నారు. దీంతో గ్రామ ప్రజలు తాగు నీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. పనిచేస్తున్న ఒకే ఒక్క చేతి పంపు వద్ద గ్రామస్తులు క్యూ కట్టాల్సి వస్తుందని సంబంధిత అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టి చేపట్టాలని కోరారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



మంగపేట: పరామర్శిస్తున్న తాటి కృష్ణ



ములుగు రూరల్: పరామర్శిస్తున్న నాయకులు

మంగపేట: మండలంలోని బ్రాహ్మణపల్లిలో హెడ్ కానిస్టేబుల్ గొప్ప చంద్రయ్య, రమణక్కపేటలో పయ్యావుల బద్రమ్మ, మల్లూరులో ఎండీ యాకూబ్ షరీఫ్, శనిగకుంటలో తోలెం ద్రౌపది, తిమ్మంపేటలో లొట్టి శ్రీను ఇటీవల వేర్వేరు కారణాలతో మృతి చెందారు. దీంతో బాధిత కుటుంబాలను బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి తాటి కృష్ణ మంగళవారం పరామర్శించారు. ఆయన వెంట బీజేపీ మండల అధ్యక్షుడు లొడె శ్రీను, ప్రధాన కార్యదర్శి మల్‌రెడ్డి సుధాకర్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు అల్లె జనార్దన్, హేమాచల క్షేత్రం మాజీ చైర్మన్ ముగులుట్ల సత్యనారాయణ, జిల్లా నాయకులు రఘు, నర్సింహులు, నరేందర్, ముత్తెబోయిన నర్సింహారావు, భూక్య రతన్‌సింగ్, సయ్యద్ నాగుల్ మీరా, గండశిరి శ్రీను, బొంబోతుల మురళి, వెంకటేశ్వర్లు, సావిత్రి, నవీన్, సాంభయ్య, తిరుమల్ రావు, నాగరాజు, యంగయ్య, గాదె శ్రీను, తిరుపతయ్య, కుమార్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ములుగు రూరల్: కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు నల్లెల్ల కుమారస్వామి అనారోగ్యంతో బాధపడుతుండగా వైఎస్సార్ టీపీ జిల్లా అధ్యక్షుడు రామసహాయం శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం పరామర్శించారు. ఈ మేరకు మంగళవారం కుమారస్వామి స్వగృహంలో కలిసి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. నాయకులు మెట్టు సురేష్, ఎండి ఖాదర్, తిరుపతి, ప్రవీణ్, దిలీప్ ఉన్నారు.

నర్సరీ పరిశీలన

మహదేవపూర్: మండలంలోని కుదురుపల్లి గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నర్సరీని ఎంపీడీఓ శంకర్‌నాయక్ మంగళవారం పరిశీలించారు. నర్సరీలో మొక్కలను ఏపుగా పెరిగే విధంగా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. ప్రతిరోజు వాచర్ల సహాయంతో రెండుమార్లు నీరు పట్టాలని, మొక్కల చుట్టూ పెరిగిన కలుపు మొక్కలను ఎప్పటికప్పుడు తీసేయాలన్నారు. అనంతరం ఎడపల్లి గ్రామ పంచాయతీలో పంచాయతీ రికార్డులను తనిఖీ చేశారు. ఎంపీడీఓతో కుదురుపల్లి పంచాయతీ కార్యదర్శి ఇందిరా, ఎడపల్లి పంచాయతీ కార్యదర్శి రమేష్, ఫీల్డ్ అసిస్టెంట్ రాజశేఖర్ తదితరులు ఉన్నారు.

దళితుడు అయినందుకే వివక్ష



మాట్లాడుతున్న యాసం రమేశ్

వెంకటాపురం(కె): కంటోన్మెంట్ ఎమ్మెల్యే సాయన్న దళితుడు అయినందుకే తెలంగాణ ప్రభుత్వం అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించకుండా వివక్ష చూపెట్టిందని మాదిగ జేఏసీ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ యాసం రమేశ్ ఆరోపించారు. మంగళవారం మండల కేంద్రంలో మాదిగ జేఏసీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఎమ్మెల్యే సాయన్న పదవి కాలం పూర్తి కాకుండానే అనారోగ్యంతో మృతి చెందితే ప్రభుత్వం అధికార లాంఛనాలతో అంత్యక్రియలు జరిపించకుండా అవమానించారని అన్నారు. ఈ కార్యక్రమంలో మాదిగ జేఏసీ మండల అధ్యక్షుడు తోకల అంజి, నాయకులు గుద్దేటి చంటి, తోకల శివ, తదితరులు ఉన్నారు.

కష్టాలు తెలుసుకునేందుకే పాదయాత్ర

చిట్యాల: ప్రజల కష్టాలను తెలుసుకుని వారి సమస్యలను కాంగ్రెస్ అధికారంలోకి రాగానే పరిష్కరించే దిశగా కృషి చేసేందుకే హాథ్ సే హాథ్ పాదయాత్రను కొనసాగిస్తున్నట్లు ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గండ్ర సత్యనారాయణరావు తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలో మండల అధ్యక్షుడు గూట్ల తిరుపతి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చిట్యాల మండలానికి మంగళవారం రాత్రి వచ్చి మండల కేంద్రంలో బస చేయనునట్లు తెలిపారు. నేడు(బుధవారం) రేగొండ మండలంలోని శ్రీలక్ష్మీనరసింహ స్వామి దేవాలయలంలో పూజలు నిర్వహిస్తాడని తెలిపారు. తిర్మలాపూర్ గ్రామం నుంచి పాదయాత్రను ప్రారంభించి మండల కేంద్రానికి చేరుకుంటారని తెలిపారు. భోజనం చేసిన అనంతరం చిట్యాల మండల కేంద్రం నుంచి ఏలేటి రామయ్యపల్లి, నవాబుపేట గ్రామాల మీదుగా మొగుళ్లపల్లి మండల కేంద్రం వరకు పాదయాత్ర కొనసాగిస్తాడన్నారు. అక్కడ బహిరంగ సభ ఉంటుందని కార్యకర్తలు, నాయకులు తరలిరావాలన్నారు.

రాష్ట్రంలో నిరంకుశ పాలన



మాట్లాడుతున్న రాకేశ్‌రెడ్డి

ములుగు రూరల్: సీఎం కేసీఆర్ రాష్ట్రంలో నిరంకుశ పాలన సాగిస్తున్నాడని బీజేపీ నాయకుడు ఏనుగుల రాకేశ్‌రెడ్డి అన్నారు. ఆ పార్టీ మండల అధ్యక్షుడు ఇమ్మడి రాకేష్ యాదవ్ అధ్యక్షతన నిర్వహించిన ప్రజా గోస-బీజేపీ భరోసా కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన కార్నర్ మీటింగ్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సీఎం కేసీఆర్ ఎన్నికల సమయంలో ఇచ్చిన డబుల్ ఇళ్ల నిర్మాణం, దళితులకు మూడు ఎకరాల భూపంపిణీ, రైతుల రుణ మాఫీ చేయడంలో పూర్తిగా విఫలమయ్యారని అన్నారు. కేంద్ర ప్రభుత్వం నిరుపేదల కోసం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ఆయన వివరించారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజలకు ఉచిత విద్య, వైద్యం అందిస్తామని అన్నారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి ప్రజలు బుద్ధి చెప్పాలని అన్నారు. ప్రధాన కార్యదర్శి నగరపు రమేష్, సిరికొండ బలరాం, రవీంద్రాచారి, వైనాల సంపత్, భిక్షపతి పాల్గొన్నారు.

జిల్లా స్థాయిలో విద్యార్థి ప్రతిభ



విద్యార్థికి బహుమతిని అందజేస్తున్న జయదేవ్

మంగపేట: జిల్లా కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఫోరమ్ ఆఫ్ ఫిజికల్ సైన్స్ టీచర్స్(ఎఫ్‌పీఎస్‌టీ) ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి సైన్స్ టాలెంట్ టెస్ట్ పోటీలలో రాజుపేట జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి అర్జున్ జ్ఞానదీప్ తృతీయ స్థానంలో నిలిచినట్లు హెచ్‌ఎం గడ్డం శ్రీనివాస్ మంగళవారం తెలిపారు. జిల్లా సైన్స్ అధికారి జయదేవ్ విద్యార్థికి బహుమతులు ప్రదానం చేశాడన్నారు. జిల్లా స్థాయిలో ప్రతిభను కనబర్చిన విద్యార్థిని హెచ్‌ఎం శ్రీనివాస్, ఉపాధ్యాయులు, పలువురు అభినందించారు.

క్విజ్ పోటీల్లో తృతీయ బహుమతి



బహుమతులు అందుకుంటున్న విద్యార్థినులు

వెంకటాపురం(ఎం): వరంగల్‌లోని బిర్లా ఓపెన్ మైండ్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో సోమవారం జరిగిన ఉమ్మడి జిల్లా స్థాయి క్విజ్ పోటీల్లో వెంకటాపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలకు తృతీయ బహుమతి లభించినట్లు ప్రధానోపాధ్యాయుడు జనగాం బాబురావు మంగళవారం తెలిపారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 16 పాఠశాలల నుంచి విద్యార్థులు పాల్గొనగా జిల్లా నుంచి వెంకటాపూర్, మల్లంపల్లి పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారని పేర్కొన్నారు. పాఠశాల నుంచి చీకుర్తి పూజిత, అక్షిత, హర్షతేజ క్విజ్ కాంపిటీషన్ పోటీల్లో పాల్గొని తృతీయ బహుమతి సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్ రమేష్, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

గీత కార్మికుడికి చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న లక్ష్మణ్

వెంకటాపురం(ఎం): మండలంలోని లక్ష్మీదేవిపేట గ్రామానికి చెందిన చిర్ర వీరస్వామి ఇటీవల తాటి చెట్టు ఎక్కుతూ ప్రమాదవశాత్తు కిందపడగా గాయాలయ్యాయి. ఈ మేరకు కల్లుగీత కార్మిక సంఘం సభ్యులు మంగళవారం బాధితుడిని పరామర్శించి బీసీ వెల్ఫేర్ జిల్లా అధికారి లక్ష్మణ్‌రావు చేతులమీదుగా రూ.15వేలు విలువ గల చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ గౌడ ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడు ముంజాల భిక్షపతి గౌడ్, పైడిమల్ల రంజిత్, కత్తి వెంకన్న, ఆకుల శ్రీనివాస్, కల్లుగీత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గుండెబోయిన రవి, జిల్లా నాయకులు దొమ్మటి సదానందం, పెరుమండ్ల పున్నం, మామిండ్ల సంపత్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు రుణాలు ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచ్ కృష్ణ

ఏటూరునాగారం: డీసీసీ బ్యాంక్ ద్వారా రైతులకు రుణాలు ఇవ్వాలని రామన్నగూడెం సర్పంచ్ దొడ్డ కృష్ణ అన్నారు. మంగళవారం మండలంలోని రామన్నగూడెంలో డీసీసీ బ్యాంక్ ఏటూరునాగారం బ్రాంచ్ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. వ్యవసాయ అనుబంధ రుణాలు, నగదు రహిత లావాదేవిలు, డిపాజిట్‌ల పైన బుర్రకథ ద్వారా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ బ్యాంక్ మేనేజర్ సంపత్‌కుమార్, సూపర్‌వైజర్ రమేశ్, బ్యాంక్ సిబ్బంది, పీఏసీఎస్ చైర్మన్ కూనూరు అశోక్, వైస్ చైర్మన్ బాలరాజు, సొసైటీ డైరెక్టర్లు కోటయ్య, పుల్లయ్య, ఎంపీటీసీ అల్లి సుమలత శ్రీను, రైతులు, తదితరులు పాల్గొన్నారు.